## క్లుప్తంగా

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని నిరసన



నర్సంపేట : ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదంటూ చెన్నారావుపేట మండలంలోని చెరువుకొమ్ముతండా శివారు వాల్యతండాకు చెందిన బోడ రమేశ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెన్నారావుపేట-నర్సంపేట ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుమారు 30 ఏళ్లుగా కాంగ్రెస్‌కు సేవ చేస్తున్నా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని తెలిపాడు. కాంగ్రెస్ నాయకులు వచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.

### ముదిరాజ్ సంఘం పెద్దమనిషిగా రాజేందర్



నర్సంపేట రూరల్ : ముదిరాజ్ సంఘం మాధన్నపేట, నాగుర్లపల్లి గ్రామాల పెద్దమనిషిగా గిరబోయిన రాజేందర్ ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికలు నిర్వహించగా జల్లి ఐలయ్యపై రాజేందర్ ఆధిక్యత సాధించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు మారపాక నర్సయ్య, సభ్యులు పెండ్యాల నర్సయ్య, ముప్పారపు తిరపతి, దండు రమేశ్, మారపాక సురేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పెద్దమనిషి పెసర సుదర్శన్, నాయకులు బక్కయ్య, మొగిలి, మహర్షి, వెంకటస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కమిటీ ఎన్నిక



నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగిరెడ్డి అనిల్, ఉపాధ్యక్షుడిగా జంగిలి రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా జంగిలి ప్రశాంత్, కార్యదర్శులుగా చాతల్ల గణేశ్, జంగిలి పవన్, ప్రచార కార్యదర్శిగా జంగిలి భాస్కర్, కోశాధికారిగా బారపాక నవీన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బర్ల దేవదాస్, వ్యవస్థాపక అధ్యక్షులు సాధు నర్సింగారావు, నర్మెట్ట యాదగిరి, సాధు రాజు, మాజీ అధ్యక్షులు బొమ్మకంటి రాజు, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### భూకబ్జాదారుపై చర్యలు తీసుకోండి

వర్ధన్నపేట : మండలంలోని తాళ్లకుంట తండా, బీసీ తండాలోని సర్వే నెంబర్ 492లోన్న ప్రభుత్వ కాల్వ భూమి కబ్జా చేసిన భూక్య కిషన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ భవానీకుంటకు చెందిన ఆంగోతు సునీత కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేసింది. అనంతరం సునీత సమస్యను వివరించారు. తమ వ్యవసాయ భూమి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో 2005లో అప్పటి ప్రభుత్వం కాల్వ తీయగా, ఈనెల 1న జేసీబీ, డోజర్‌తో సదరు భూమిలోని చెట్లు, రాళ్లను కిషన్ తొలగించి కబ్జా చేశాడని ఆరోపించారు. ప్రశ్నించిన తన భర్తపై దాడికి పాల్పడ్డాడని వాపోయింది. కిషన్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరింది.

### పోలీసులకు ఫిర్యాదు

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన బొల్లే రాజుపై అదే గ్రామానికి చెందిన పోస్టు మాస్టర్ బాల్లె రాజు సోమవారం ఫిర్యాదు చేశారు. బొల్లే రాజు తన విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని, రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లు తాను తీసుకున్నట్లు ప్రచారం చేయడంతోపాటు పోస్టాఫీసు ఎదుట ఇసుక, కంకర పోసి వృద్ధులకు, దివ్యాంగులకు ఆటంకం కలిగిస్తున్నాడని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులతో గొడవ పెట్టుకుని మంత్రాలు వస్తాయని ఆరోపిస్తున్నాడని వివరించారు. బొల్లే రాజు వ్యవహారంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరాడు.

### నివాళి

రాయపర్తి : మండలంలోని మొరిపిరాలలో పంచాయతీ కార్యదర్శి పెదగోని నాగన్న తండ్రి కొమురయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు సోమవారం నివాళులర్పించారు. అనంతరం నాగన్నను, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, అనిమిరెడ్డి యాకూబ్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- పెచ్చులూడుతున్న భవనం
- మరమ్మతులు, పునర్నిర్మాణంపై నిర్లక్ష్యం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) శిథిలావస్థకు చేరుకుంది. భవనంలోని గదుల్లో పెచ్చులూడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది భయాందోళన నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం బెంబేలెత్తుతున్నారు. మరమ్మతులు, పునర్నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వం 2000 సంవత్సరంలో మండల కేంద్రంలో ఆరు పడకలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రారంభించింది. ఆస్పత్రిలో వైద్యురాలు, తొమ్మిది మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. భవనం నిర్మించి పాతిక సంవత్సరాలు పూర్తి కాగా ఏడాదిగా శిథిలావస్థకు చేరుకుంటోంది. ఆస్పత్రిలోని గదుల్లో పెచ్చులూడి ప్రమాదకర పరిస్థితి కనపడుతోంది. జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణకు వచ్చిన సందర్భాల్లో భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని ఉద్యోగులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో మరమ్మతుల కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. పంచాయతీ రాజ్, ఇతర సంబంధిత శాఖల అధికారులు సైతం భవనాన్ని సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు. కాగా ఏడాదిగా మరమ్మతులు లేదా భవన నిర్మాణంపై స్తబ్దత నెలకొంది.

**స్పష్టత కరువు**

ఆస్పత్రికి మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కొలతలు తీసుకోవడంతోపాటు పనులు చేయించడానికి సిద్ధమయ్యారు. కాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిధులపై స్పష్టత కరువైంది. భవన మరమ్మతు విషయాన్ని వైద్యులు, అధికారులు పర్యవేక్షించినప్పటికీ సరైన సమాధానం రాకపోవడంతో చేసేది లేక మిన్నకుండిపోతున్నారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆస్పత్రి భవన మరమ్మతులు లేదా నూతన భవన నిర్మాణానికి కృషి చేసి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**



పీహెచ్‌సీ భవనం శిథిలమైన విషయాన్ని, మరమ్మతులు లేదా పునర్నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఆస్పత్రి శిథిలావస్థలో ఉన్న విషయం వాస్తవమే. గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం నిధులు ఏ శాఖ ఆధీనంలో ఉన్నాయనే విషయంలోనూ స్పష్టత కొరవడింది. భవన నిర్మాణ విషయమై గతంలో ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాము.

– జ్యోతి, వైద్యురాలు

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న అశోక్

నెక్కొండ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ తెలిపారు. మండలంలోని పత్తిపాక, గుండ్రపల్లి, బంజరుపల్లి, నెక్కొండ గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు సోమవారం ఆయన ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు.అనంతరం ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సదానందం, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నర్సంపేట కోర్టు ఏపీజీ బండి శివకుమార్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, టీబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మహిళ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామారపు శిరీశ, నాయకులు కేవీ.సుబ్బారెడ్డి, కుసుమ చెన్నకేశవులు, ఎర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

# శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



గీసుకొండ : శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రవికుమార్, తదితరులు



నర్సంపేట : చిత్రపటానికి పూలమాల వేస్తున్న గూడూరు సందీప్, నాయకులు



వర్ధన్నపేట : చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

నర్సంపేట/గీసుకొండ/వర్ధన్నపేట/రాయపర్తి : దేశానికి భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అందించిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నర్సంపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు గూడూరు సందీప్, ఇతర నాయకులు అన్నారు. నర్సంపేట, గీసుకొండ, వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించి మాట్లాడారు. దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించారని, ఎనలేని సేవలు అందించారని వివరించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, గట్టికొప్పుల రాంబాబు, రత్నం సతీశ్, వన్నాల వెంకటరమణ, చొక్కం శ్రీనివాస్, ముల్క ప్రసాద్, మల్యాల వినయ్‌కుమార్, బోడ గోల్యానాయక్, రాంచందర్, కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, మార్త సంధ్యారాణి, జూలూరి మనీశ్ గౌడ్, కుమారస్వామి, కొండేటి అనిత, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం, నూనె అనిల్, వడ్లకొండ రవి, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వసతులను వినియోగించుకోవాలి

- అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సమత



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సమత, తదితరులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ మోకిరెడ్డి సమత కోరారు. మండలంలోని కమ్మపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన నోట్‌బుక్కులు, వర్క్‌బుక్కులను సోమవారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పాటుపడుతోందని తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, తదితర అనేక అవకాశాలు కల్పిస్తోందని వివరించారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సర్దార్, ఉపాధ్యాయులు కొంగర కవిత, రమ, తదితరులు పాల్గొన్నారు.

### 'నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం'

రాయపర్తి : నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలోని శ్రీమహాత్మ హైస్కూల్‌లో యాజమాన్యం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, టై, బెల్ట్, షూ విక్రయిస్తోందని తెలంగాణ ఎస్సీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి పంతం విజయేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు వెలిశాల శ్యామ్ తెలిపారు. స్కూల్ యాజమాన్య తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఈఓ కార్యాలయంలో అధికారికి సోమవారం వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయేందర్, శ్యామ్ మాట్లాడారు. పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ లేకున్నా నడిపిస్తున్నారని చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. వరంగల్‌కు చెందిన కాంటూరి భార్గవి సోదరుడు కిరణ్‌తో కలిసి మైసంపల్లికి వెళ్లి వస్తుండగా మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద ఇంటి నిర్మాణం కోసం పోసిన కంకరలో బైక్ అదుపు తప్పి పడిపోయింది. భార్గవికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

### డిగ్రీ ప్రవేశాలకు 25 వరకు గడువు



నర్సంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 25వ తేదీ వరకు ఉందని ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ఆయన కళాశాలలో మీడియాకు సోమవారం వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం గడువు పెంచిందని చెప్పారు. సమావేశంలో దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచందర్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ సోమయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు, రేపు మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

సంగెం : మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో నేడు (మంగళవారం), రేపు (బుధవారం) స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో 5, ఇంటర్ ఎంపీసీలో 1, సీఈసీలో 7 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులు అర్హత పత్రాలతో స్కూల్‌లో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కోసం పీవీవీ గణేశ్‌ను సెల్ నంబర్ 8374977904లో, సాంబయ్యను 9492643013లో సంప్రదించాలని సూచించారు.

### టెన్త్ టాపర్లకు సన్మానం



నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతిలో ప్రతిభ చాటిన టాపర్లను హెచ్‌ఎం రంగారావు సన్మానించారు. మండలానికి చెందిన విద్యుత్ శాఖ రిటైర్డ్ ఎస్ఈ చల్లా రఘోత్తం రెడ్డి తల్లిదండ్రులు, సోదరుడి జ్ఞాపకార్థం మొదటి స్థానంలో నిలిచిన సరస్వతికి రూ.5 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన చరణ్, రాకేశ్‌లకు రూ.3 వేల, రూ.2 వేల బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. చదువే అన్నిటికీ మూలమన్నారు. రఘోత్తంరెడ్డిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సారంగం, దొంగల ఐలయ్య, తాళ్లపల్లి భాస్కర్, కక్కెర్ల నాగయ్య, రామారపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

### జాన్‌పాక వాసులకు 'భగీరథ' నీరు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 17 డివిజన్ పరిధిలోని జాన్‌పాక ప్రాంత ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందనుంది. బల్దియా ఇంజనీరింగ్ అధికారులు సోమవారం మిషన్ భగీరథ నీటి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. కొన్నేళ్లుగా సుమారు 90 కుటుంబాలకు భగీరథ నీరు అందని పరిస్థితి నెలకొనగా సమస్యను స్థానిక మైనారిటీ నాయకులు జానీ, షేక్ దస్తగిరి, నజీరుల్లా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు ఆర్ అండ్ బీ అధికారుల అనుమతితో రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపట్టి భగీరథ పైప్‌లైన్‌కు నల్లా కనెక్షన్ ఇచ్చారు.

### ప్రభుత్వ ఉద్యోగుల సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగులు కలుసుకుని పలు అంశాలపై తీర్మానం చేసుకున్నారు. గ్రామంలోని పిల్లల చదువులకు తోడ్పాటు అందించాలని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని తీర్మాణం చేశారు. అనంతరం అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సర్దార్, కోకన్వీనర్లుగా కొక్కుల రాజేందర్, దండు చిరంజీవి, పాలడుగుల రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బోడె ప్రభాకర్‌రెడ్డి, దండు ఉపేందర్, ఒద్దుల రవి, కత్తి రవి, ఇంద్రారెడ్డి, దండు సదయ్య, సొడారపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ప్రజావేదిక

వర్ధన్నపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు అందజేసిన నివేదికలపై సమీక్షించేందుకు నేడు (మంగళవారం) మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఓ కౌసల్యదేవి హాజరవుతారని పేర్కొన్నారు. ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందాలు, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

### ఎండిపోయిన చెట్లతో బెంబేలు



వర్ధన్నపేట : మండలంలో ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఉప్పరపల్లి, అనంతరం, గోవనపల్లి, కొంకపాక, పర్వతగిరి క్రాస్ రోడ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు ఎండిపోయి కూలిపోయేలా ఉండడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, సైకిలిస్టులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాలిస్న దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధిపై ఎమ్మెల్యేతో ముఖాముఖి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులపై కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజుతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మున్సిపాల్టీ కమిటీ ఇన్‌చార్జ్ అనిమిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తెట్టెకుంటతండా, కొనాపురం గ్రామాల్లోని సమస్యలు తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఆర్‌డీఓ కార్యాలయం, సబ్ జైలు, మున్సిఫ్ కోర్టు, 100 పడకల ఆస్పత్రి, బస్ డిపో, తదితరాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు సిలివేరు శ్రీధర్ యాదవ్, పులి శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, రవీందర్, భిక్షపతి, కీమా నాయక్, నాను నాయక్, ఎలికట్టే ముత్తయ్య, ఎల్లయ్య, లక్మానాయక్, ధీకొండ యుగేందర్, రామగిరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ హయాంలోనే చెన్నారావుపేట మండలం అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని తండాలను, గ్రామాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికాయుతంగా పని చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే మండలానికి ఏ మేరకు నిధులు తీసుకొచ్చాడో? చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.9 కోట్లతో తండాలకు బీటీ రోడ్లను మంజూరు చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే వాటన్నటిని రద్దు చేశాడన్నారు. మండలంలో అభివృద్ధి నిలిచిపోవడం బాధాకరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులను ఎన్నికల హామీలపై ప్రజలు నిలదీయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ భానోతు పత్తి నాయక్, మాజీ ఎంపీపీ జక్క అశోక్, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, నాయకులు కొండవీటి ప్రదీప్‌కుమార్, మహ్మద్ రఫీ, కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, మురళి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతో సైబర్ నేరాలకు చెక్



నెక్కొండ : మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్

- సీఐ శ్రీనివాస్

నెక్కొండ : అవగాహనతో సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని సీఐ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని మాంటిస్సోరీ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు అనేక ప్రలోభాలకు గురి చేస్తూ మోసాలకు పాల్పడుతునానరని చెప్పారు. ఉచిత మొబైల్ యాప్‌లను ఎరగా వేస్తున్నారని తెలిపారు. అనంతరం ట్రెయినీ ఎస్సై కల్యాణ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్త మధూకర్‌రెడ్డి, డైరెక్టర్లు తాటిపర్తి అంజన్‌రెడ్డి, డాక్టర్ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

**జీవితంలో విద్యార్థి దశ కీలకం**

పర్వతగిరి : జీవితంలో విద్యార్థి దశ కీలకమని ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సైబర్ నేరాలు, ఇతర అంశాలపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా, పాన్ మసాలా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ రాణిస్తూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. సదస్సులో హెచ్‌ఎం పాక రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : మొక్క నాటుతున్న ఎస్సై కుమార్

**వ్యసనాలకు బానిస కావొద్దు**

గీసుకొండ : విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై కుమార్ కోరారు. మండలంలోని మచ్చాపూర్‌లోని ప్రగతి హైస్కూల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లకు బానిసలుగా మారొద్దన్నారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలతో పశు సంరక్షణ

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య



మందులు అందజేస్తున్న వెంకటయ్య, తదితరులు

రాయపర్తి : ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పశువుల సంరక్షణకు చొరవ చూపుతోందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డితో కలిసి వెంకటయ్య ప్రారంభించి మాట్లాడారు. పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. పాడి రైతులు పశు పోషణలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు, వైద్య సదుపాయాలను వినియోగించుకుని పశు సంపదను కాపాడుకోవాలని కోరారు. అనంతరం పశువులకు మందులు తాగించారు. పాడి రైతులకు పశువుల కోసం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ శృతి, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మందపురి మహేందర్, నాయకులు నంగునూరి అశోక్, కొండ రాంనర్సింహారెడ్డి, గిరుక ఎల్లయ్య, మందపురి అశోక్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస రాజు, సభ్యులు ఖాజా, పుల్లూరు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

### పోరాటాలతో హక్కుల సాధన

దుగ్గొండి : ఐక్యపోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో సంఘం జిల్లా కమిటి సభ్యుడు రెముడాల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మహాసభకు రాజయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు. పాలకుల తప్పుడు విధానాలపై రైతులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాలు నిర్మించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రైతుల సమస్యలు, హక్కులు, బాధ్యతలపై షార్ట్‌ఫిలింను ప్రదర్శించారు. తదనంతరం సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జంగా రాజిరెడ్డి, సభ్యులుగా జంగా జనార్దన్‌రెడ్డి, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, ఊకంటి గోపాల్‌రెడ్డి, మోహన్, గుడిపెల్లి గోపాల్ రెడ్డి, మట్ట రమేశ్, నాతి వెంకటేశ్వర్లు, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి ఎన్నికయ్యారు.

### గ్రామ సభ

ఖానాపురం : మండలంలోని కొడ్తిమాటుతండాలో 'ప్రధాన మంత్రి ధర్తీ ఆబా జాన్ భాగీధరీ అభియాన్'పై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సమావేశంలో ఏఆర్ఐ స్వామి, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఏఈఓ ఆశా దీప్, తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురిపై కేసు

గీసుకొండ : మండలంలోని గొల్లచెరువు నుంచి ఇటుక బట్టీలకు ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. జేసీబీతో రేగడి మట్టి తోడి ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో జేసీబీ డ్రైవర్ శివరాత్రి సురేశ్, ఓనర్ పవన్, ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్ మోటం సురేశ్‌లపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.